సాక్షి చిత్తూరు

మంగళవారం । 5 । నవంబర్ । 2024



మా మొర ఆలకించండి..
సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు ప్రజలు జిల్లా కలెక్టరేట్ అధికారులకు విన్నవించారు. - 8లో



తెంపు.. జంపు..
జిల్లాలోని పలు ప్రాంతాల్లో చైన్ స్నాచర్లు గత 7 రోజుల్లో 8 చోట్ల చోరీలకు పాల్పడిన ఘటనలు వెలుగు చూశాయి. - 8లో



తీరని విషాదం
స్టీల్ గిన్నెకు రంధ్రం పెట్టి టపాసులు కాల్చుతుండగా బాలుడి గొంతు తెగి చనిపోయిన ఘటన గిరిజన కుటుంబంలో తీరని విషాదం నింపింది. - 8లో

న్యూస్‌రీల్

రేపు విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీ రోడ్డులోని ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ డివిజన్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు ఈఈ మునిచంద్ర తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సమస్యలను తెలియజేయవచ్చని కోరారు.

ఏనుగుల దాడులను అరికట్టండి



డీఎఫ్‌ఓకు విన్నవిస్తున్న రైతు సంఘం నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ఏనుగుల దాడులను నియంత్రించాలని డీఎఫ్‌ఓ భరణికి జిల్లా ఏపీకేఎంఎస్ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఉమాపతినాయుడు, వెంకట్రామిరెడ్డి విన్నవించారు. గజదాడుల నుంచి పంటలను కాపాడి రైతులకు రక్షణ కల్పించాలని కోరారు. ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో దాదాపు 3 లక్షలకు కుటుంబాలు పూర్తిగా వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్నాయని తెలిపారు. ఏళ్ల తరబడి ఏనుగులు జిల్లాలోని కుప్పం, రామకుప్పం, పలమనేరు, బంగారుపాళ్యం, పులిచర్ల తదితర ప్రాంతాల్లో సంచారిస్తున్నాయన్నారు. దాదాపు 100కి పైగా ఏనుగులు అటవీ ప్రాంత సమీప పంటలు, ఇళ్లను ధ్వంసం చేస్తున్నాయని తెలిపారు. గ్రామాల పైకి చొరబడి మూగజీవాలను బలి తీసుకుంటున్నాయన్నారు. ప్రస్తుతం పంటల సాగుకు పెట్టుబడులు భారీగా పెరిగాయన్నారు. ఇలాంటి సమయంలో రైతుల పొలాల్లో వ్యవసాయ బోర్లు, ఇతర పరికరాలను ఏనుగులు తొక్కేస్తే పరిహారం కూడా ఇవ్వడం లేదని, ఇప్పటికైనా అటవీశాఖలో సిబ్బందిని పెంచి, ఏనుగుల దాడులను అరికట్టాలని కోరారు.

ఏఎన్‌ఎం గ్రేడ్‌-3 సీనియారిటీ జాబితా విడుదల

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న గ్రామ వార్డు సచివాలయ గ్రేడ్‌-3 ఏఎన్‌ఎంలకు గ్రేడ్‌-1 ఉద్యోగోన్నతి కల్పించడంలో భాగంగా సీనియారిటీ జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి తెలిపారు. అభ్యంతరాలు ఉంటే ఈనెల 7వ తేదీ 5 గంటల్లోపు తెలియజేయాలన్నారు. పదోన్నతుల విషయంలో మధ్యవర్తులు, దళారుల మాటలు నమ్మవద్దని కోరారు. వివరాల కోసం chittoor.ap.gov.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చన్నారు.

అరచేతిలో ఆస్పత్రి నిఘా



నిఘా వ్యవస్థ వీక్షణ

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వరుసగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. డాక్టర్లు ఉండడం లేదని, సిబ్బంది పట్టించుకోవడం లేదని, ఫోన్లలో కాలక్షేపం చేస్తున్నారనే ఫిర్యాదుల పరంపర కొనసాగింది. దీంతో స్పందించిన ఆస్పత్రి అధికారులు విధుల్లో అలసత్వం వహించే వారి ఆట కట్టించడానికి నిఘా వ్యవస్థను అరచేతిలోకి తీసుకునే ప్రయత్నం చేశారు. అపోలో తరఫున ఉన్న 33 సీసీ కెమెరాలతో పాటు మరో 30 సీసీ కెమెరాలను ప్రభుత్వ ఆస్పత్రి అధికారులు అమర్చారు. దీంతో సూపరింటెండెంట్ అరుణ్ కుమార్ కార్యాలయంలో ఈ నిఘా పర్యవేక్షణ ఉంటుంది. విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది పనితీరును ఆయన ఎప్పటికప్పుడు పసిగడుతున్నారు. దీంతో ఆస్పత్రి పాలన కాస్త గాడిన పడుతుందని భావిస్తున్నారు.

6వ తేదీలోపు అభ్యంతరాలు తెలియజేయండి

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మున్సిపల్, నగరపాలక పాఠశాలల్లో ఉద్యోగోన్నతులకు సిద్ధం చేసిన ప్రొవిజనల్ జాబితాలో అభ్యంతరాలు తెలియజేయాలని డీఈఓ వరలక్ష్మి కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మున్సిపల్, నగరపాలక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ కేడర్‌కు ఉద్యోగోన్నతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎస్జీటీ కేడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్, స్కూల్ అసిస్టెంట్ కేడర్ నుంచి హెచ్‌ఎం కేడర్‌కు ఉద్యోగోన్నతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రొవిజనల్ జాబితాను డీవైఈఓ, ఎంఈఓల మెయిల్స్‌కు పంపినట్లు చెప్పారు. ఆ జాబితాలను పరిశీలించుకుని లిఖిత పూర్వకంగా ఈ నెల 6వ తేదీలోపు ఏవైనా అభ్యంతరాలుంటే తగిన ఆధారాలతో ఫిర్యాదు చేయాలని కోరారు.

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు సమ్మేటివ్‌-2 పరీక్షలు రాయనున్నారు. రాష్ట్ర విద్యాపరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) రూపొందించిన ఉమ్మడి పరీక్షా పత్రంతో ప్రభుత్వ యాజమాన్య స్కూళ్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు ఆయా యాజమాన్యాల సొంత ప్రశ్నపత్రాలను అనుసరించే పరీక్షలు నిర్వహిస్తారని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. పాతవిధానాన్ని పక్కన పెట్టి ప్రైవేట్ స్కూళ్లకు ఇలా అనుమతులు ఇవ్వడంపై ఆగ్రహజ్వాలలు వ్యక్తం అవుతున్నాయి.

పరీక్షలకు వేళాయే..!



- ఈ నెల 6 నుంచి ప్రారంభం కానున్న సమ్మేటివ్‌-2 పరీక్షలు
- విద్యార్థుల సామర్థ్య స్థాయిని తెలుసుకునే అవకాశం
- ప్రభుత్వ స్కూళ్లకు ప్రశ్నపత్రాల పంపిణీ పూర్తి
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ అధికారులు
- ఈ నెల 8 వరకు పరీక్షల నిర్వహణ
- గతంలో అందరికీ ఒకటే ప్రశ్నపత్రం
- ఈసారి ప్రైవేట్ స్కూళ్లలో వారు రూపొందించిన క్వశ్చన్ పేపర్‌తోనే పరీక్షలు రాసుకునేందుకు అనుమతి

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థుల విద్యాస్థాయిని తెలుసుకునేందుకు ఏటా నాలుగు సెల్ఫ్ అసెస్‌మెంట్, రెండు సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తారు. అందులో భాగంగా రెండో సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షను బుధవారం నుంచి జిల్లావ్యాప్తంగా నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అన్ని యాజమాన్యాల పాఠశాలలు 2982 ఉన్నాయి. అందులో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 2,84,128 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఒకటి నుంచి ఐదో తరగతి చదివే విద్యార్థులకు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం 1.10 నుంచి 2.10 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఆరు నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.10 నుంచి 2.10 గంటల వరకు ఒక పరీక్ష, 2.20 నుంచి 3.20 గంటల వరకు మరో పరీక్ష జరుగుతుంది. ఇక తొమ్మిది, పది తరగతులు విద్యార్థులకు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, మళ్లీ 11.15 నుంచి 12.15 గంటల వరకు నిర్వహిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ముద్రిత ప్రశ్నపత్రాలను ఎంఆర్‌సీ కార్యాలయం, కాంప్లెక్స్ కేంద్రాల నుంచి సరఫరా చేస్తారు. అందులోనూ ప్రభుత్వ యాజమాన్య స్కూళ్లకు మాత్రమే వీటిని ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా అందజేస్తారు.

ప్రైవేట్ యాజమాన్యాల్లో సొంత ప్రశ్నపత్రం..

జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో ఆయా యాజమాన్యాలు రూపొందించే సొంత ప్రశ్నపత్రాలనే పరీక్షలకు వినియోగించనున్నారు. గతంలో జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం ఆధ్వర్యంలో ప్రైవేట్ యాజమాన్యాలకు సైతం ప్రశ్నపత్రాలను సరఫరా చేసేవారు. దీంతో ఆయా యాజమాన్యాల నిర్వాహకుల్లో పరీక్షల నిర్వహణ పట్ల బాధ్యత ఉండేది. అయితే ఈసారి గత విధానాన్ని అనుసరించడం లేదు. ఈ విధానంతో ప్రైవేట్ స్కూళ్లలో పరీక్షల నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంటుందని విద్యావేత్తలు అంటున్నారు.

జిల్లాలోని పాఠశాలల వివరాలు

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 1,909	చదువుతున్న విద్యార్థులు 54,714
ప్రైవేట్ ప్రాథమిక పాఠశాలలు 155	చదువుతున్న విద్యార్థులు 40,740
ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలు 205	చదువుతున్న విద్యార్థులు 12,430
ప్రైవేట్ ప్రాథమికోన్నత పాఠశాలలు 88	చదువుతున్న విద్యార్థులు 16,927
ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 355	చదువుతున్న విద్యార్థులు 90,122
ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు 172	చదువుతున్న విద్యార్థులు 42,760



ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు..



జిల్లాలో ఈ నెల 6వ తేదీ నుంచి ఎస్‌ఏ-2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశాం. సెల్ఫ్ అసెస్‌మెంట్-2 పరీక్షలను ఉపాధ్యాయులు పకడ్బందీగా నిర్వహించాలి. ప్రతి పేపరుపై జిల్లా కోడ్ ఉంటుంది. ఏ పాఠశాల నుంచి అయినా పేపరు లీక్ అయితే క్యూఆర్ కోడ్ ద్వారా తెలుసుకునే వీలుంది. పబ్లిక్ పరీక్షల మాదిరిగానే సెల్ఫ్ అసెస్‌మెంట్-2 పరీక్షలను నిర్వహించాలి. పరీక్షల నిర్వహణలో ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయ్. – వరలక్ష్మి, డీఈఓ, చిత్తూరు.

ప్రశ్నపత్రాలు పంపిణీ..



ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా సరఫరా అయిన ప్రశ్నపత్రాలను మండల కేంద్రాలకు పంపించాం. ప్రభుత్వ యాజమాన్యాలకు మాత్రమే ప్రశ్నాపత్రం పంపడం జరుగుతుంది. ప్రైవేట్ యాజమాన్యాల్లో సొంత ప్రశ్నపత్రం వినియోగిస్తారు. ఎస్‌ఏ-2 పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్ష జరిగే రోజు మాత్రమే పేపర్లను స్కూళ్లకు సరఫరా చేయనున్నాం. ఎక్కడా ఎటువంటి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేని విధంగా పరీక్షలు నిర్వహిస్తున్నాం. – పరశురామనాయుడు, సెక్రటరీ, డీసీఈబీ, చిత్తూరు

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



జిల్లా అధ్యక్షుడు సోమశేఖరనాయుడు



జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్

చిత్తూరు కలెక్టరేట్ : యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఎస్ నాయుడు, ఎన్నికల పరిశీలకులు రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ ఎన్నికలను సోమవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా సోమశేఖరనాయుడు (ఐరాల), ప్రధాన కార్యదర్శిగా మణిగండన్ (విజయపురం), గౌరవ అధ్యక్షులుగా సుధాకర్‌రెడ్డి (తవణంపల్లి), సహాధ్యక్షులుగా రెడ్డెప్ప నాయుడు (పూతలపట్టు), రెహానా బేగం (యాదమరి), కోశాధికారిగా ప్రసన్న కుమార్ (గంగవరం) ఎన్నికయ్యారు. అలాగే కార్యదర్శులుగా పలువురిని ఎన్నుకోగా, రాష్ట్ర కౌన్సిలర్లుగా రఘుపతిరెడ్డి (శాంతిపురం), దీనావతి(ఎస్‌ఆర్ పురం), బాషా (పూతలపట్టు), మునిరత్నం (నగరి)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

నాణ్యమైన విద్య అందించండి



మాట్లాడుతున్న కొమ్మోజు శ్రీనివాసరావు

పూతలపట్టు: ప్రభుత్వ స్కూళ్లలో ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు కె.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో యూటీఎఫ్ జిల్లాస్థాయి స్వర్ణోత్సవ మహాసభలు ఘనంగా ముగిశాయి. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికే ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఉందన్నారు. ఈ సంవత్సర కాలంలో జిల్లా శాఖలో పనిచేసిన విధానంపై పలు మండలాల నాయకులు వివరించారు.

పెట్రోల్, డీజిల్ రాయితీకి దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని దివ్యాంగులు పెట్రోల్, డీజిల్ రాయితీకి దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని దివ్యాంగులు ఏదైనా సొంత వ్యాపారం చేస్తుండడం, గుర్తింపు ఉన్న ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తూ మూడు చక్రాల మోటారు వాహనాలు ఉన్నవారు ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు సదరం మెడికల్ సర్టిఫికెట్, తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకుఖాతా పుస్తకం మొదటి పేజీ, వ్యాపారం, సంస్థలలో పని చేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు జతచేసి అందజేయాలన్నారు. వివరాలకు 08572- 296506 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వేలంతో రూ.23.54 లక్షల ఆదాయం

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని పాదరక్షలు భద్రపరచు లైసెన్స్‌కు బహిరంగ వేలం నిర్వహణతో ఆలయానికి ఆదాయం వచ్చినట్లు ఈఓ గురుప్రసాద్ తెలిపారు. ఏడాది కాల పరిమితితో ఇటీవల సీల్ టెండర్లు, ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించామన్నారు. ఇందుకు సంబంధించి సోమవారం వేలంపాట నిర్వహించగా అమర్‌నాథ్ అనే వ్యక్తి రూ.23,54,759లకు ఈ లైసెన్స్ దక్కించుకున్నట్లు చెప్పారు. మణికంఠేశ్వర స్వామి వారి ఆలయం ఎదురుగా దుకాణం, కల్యాణకట్ట ఎదురుగా ఉన్న దుకాణం, గోమయం లైసెన్స్ హక్కుకు ఎవరూ వేలంలో పాల్గొనలేదని ఈఓ తెలిపారు.

రక్షించలేనప్పుడు రాజీనామా చేయండి



మాట్లాడుతున్న మాజీ మంత్రి రోజా

శ్రీకాళహస్తి: ప్రజలను రక్షించలేనపుడు రాజీనామా చేయాలని మాజీ మంత్రి రోజా డిమాండ్ చేశారు. హోంశాఖ పనితీరును తప్పుబట్టిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 125 రోజులవుతుంటే వందకు పైగా మానభంగాలు, హత్యలు, చంపడాలు, తగులబెట్టడాలు జరిగాయన్నారు. ఇవన్నీ చూస్తుంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆమె మండిపడ్డారు. ఈవీఎంలు ట్యాంపరింగ్ చేసి గెలిచారు కాబట్టే హామీలను డైవర్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఒక మహిళ హోంమంత్రిగా ఉన్నా కూడా మహిళలకు రక్షణ కల్పించలేకపోతే ఎలా..? అని ప్రశ్నించారు. వెంటనే హోంమంత్రి అనిత రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ కుంభకర్ణుడిలా నిద్రపోయి ఆరు నెలల తరువాత ప్రెస్‌మీట్ పెట్టి ఏదో ఒకటి మాట్లాడేసి వెళ్లిపోవడం కాదన్నారు. పీఠాపురం వెళ్లి కలబొల్లి మాటలు మాట్లాడుతున్నారని, అదేమంటే అధికారులు, పోలీసులు పనిచేయడం లేదంటూ నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్‌ఆర్‌సీపీ గతంలో చేసిన పాపాలంటూ నిందలుమోపి తప్పించుకోవాలని చూస్తున్నారని, ఇలాంటి అధికారులను సస్పెండ్ చేసి పనిచేసే అధికారులను పెట్టుకోవాలన్నారు. గత జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏనాడైనా మూడేళ్ల పాపను లైంగిక దాడిచేసి చంపారా అని ప్రశ్నించారు. హామీలు పక్కదోవ పట్టించేలా చంద్రబాబు డ్రామాలు ఆడుతున్నారని, పవన్ కల్యాణ్ వత్తాసు పలుకుతూ ప్రెస్‌మీట్‌లు పెడుతూ సినిమాలో నటించుకుంటూ తన పని తాను చేసుకుంటున్నాడని విమర్శించారు.

జిల్లా బాలుర షూటింగ్‌బాల్ జట్టు ఎంపిక



జిల్లా షూటింగ్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

రామకుప్పం: ఈ నెల 9, 10 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి బాలుర షూటింగ్‌బాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా సీనియర్ బాలుర షూటింగ్‌బాల్ జట్టును ఎంపిక చేసినట్లు అసోసియేషన్ చైర్మన్ మహేష్, కార్యనిర్వాహక కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం జిల్లా షూటింగ్‌బాల్ జట్టు క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించి, అందులో ప్రతిభ కనబర్చిన 12 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా వస్తే కోతే!



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలల్లోనే ఉద్యోగుల పట్ల రోజుకో నిబంధనతో ఇబ్బందులు పెడుతోంది. ఈసారి వైద్యశాఖలోని ఉద్యోగులను టార్గెట్ చేసింది. ఈనెల నుంచి హాజరు పేరుతో వేతనాల్లో కోతలు మొదలయ్యాయి. ఎన్‌హెచ్‌ఎం పరిధిలో పని చేసే 180 మంది వరకు జీతాల్లో కోత పడింది. దీంతో సర్కారు తీరుపై ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. తాజాగా విధులకు ఆలస్యంగా హాజరైతే జీతంలో కోత తప్పదని అధికారులు హెచ్చరించడంతో వారు మరింత ఆందోళనకు గురవుతున్నారు.

- వైద్యశాఖ సేవలను నిర్వీర్యం చేసేలా కుట్ర పన్నుతున్న కూటమి సర్కారు
- వేతనాలు అందించడంలో ఇప్పటికే ఆంక్షలు
- తాజాగా వైద్యశాఖలోని పలు విభాగాల్లోని ఉద్యోగుల పట్ల కక్షపూరిత ధోరణి
- నిమిషాల పాటు ఆలస్యంగా వచ్చినా వేతనాల్లో కోత
- హాజరు సాకును బూచిగా చూపుతున్న ప్రభుత్వ ఉన్నతాధికారులు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైద్యశాఖకు అధిక ప్రాధాన్యం
- ఈ నెల 180 మందికి పూర్తిస్థాయిలో అందని జీతం
- లబోదిబోమంటున్న ఉద్యోగులు



చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలందిస్తున్న వైద్యులు

జిల్లా వివరాలు..

పీహెచ్‌సీలు	అర్బన్ హెల్త్ సెంటర్లు	
50	15	
సీహెచ్‌సీలు	ఏరియా ఆస్పత్రులు	జిల్లా ఆస్పత్రి
8	4	1

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కోవిడ్ విపత్తు సమయంలో వైద్య ఆరోగ్యశాఖ అందించిన సేవలు ఎనలేనివి. కరోనా వైరస్ ప్రపంచవ్యాప్తంగా మనుషుల ప్రాణాలను హరిస్తున్నా.. మన రాష్ట్రంలో మాత్రం ధైర్యసాహసాలతో కరోనా సోకిన రోగులకు సేవలందించారు. విధి నిర్వహణలో పలువురు ప్రాణాలు కూడా కోల్పోయారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం వైద్య ఆరోగ్య సేవలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోంది. ఈ నేపథ్యంలో 108, 104 ఉద్యోగులకు జీతాలు ఇవ్వడంలో జాప్యం చేస్తోంది. ఆరోగ్యశ్రీ ఉద్యోగులను అయోమయానికి గురిచేస్తోంది. ఇదే మాదిరిగానే ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జీతాల్లో కోత పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తోందని ఆ విభాగంలోని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ఎంతమంది పని చేస్తున్నారంటే..!

జిల్లావ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎం(నేషనల్ హెల్త్ మిషన్) కింద ఎంఎల్‌హెచ్‌పీలు (మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు) 464 మంది, స్టాఫ్‌నర్సులు 236 మంది, మెడికల్ ఆఫీసర్లు 38 మంది, ల్యాబ్ టెక్నీషియన్లు 36 మంది, ఫార్మాసిస్టులు 34 మంది, అటెండర్లు, వాచ్‌మెన్లు 20 మంది వరకు పని చేస్తున్నారు. వీరికి ప్రతినెల 21 నుంచి 25వ తేదీ వరకు జీతాలు పెడుతున్నారు. అయితే ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు సంబంధించి జిల్లావ్యాప్తంగా 180 మంది గానూ 1 నుంచి 8 రోజుల వరకు జీతాల్లో కోత పడినట్లు ఉద్యోగులు వాపోతున్నారు.

గత ప్రభుత్వంలో ఇలా..

జిల్లావ్యాప్తంగా గత నెలలో కురిసిన వర్షాల కారణంగా కొంతమంది విధులకు వెళ్లడంలో కాస్త ఆలస్యమైంది. ఇంట్లో, ఇతరత్రా కారణాల వల్ల కొన్ని నిమిషాలు ఆలస్యం అయిన వారికి సైతం కూటమి సర్కారు జీతాల్లో కోత వేసింది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో గ్రామాల్లోనే విలేజ్ హెల్త్ క్లినిక్‌లను స్థాపించింది. ఇక ఆస్పత్రులకు వైద్యులు సక్రమంగా రావడం లేదనే ఫిర్యాదులకు స్పందించి ఫేషియల్ అటెండెన్స్ విధానాన్ని తీసుకొచ్చి పారదర్శక పాలనకు పెద్దపీట వేసింది. ఈ ఫలితంగా ఉద్యోగులు సమయానికి విధులకు హాజరై సేవలందించేవారు. ఇప్పుడు కూడా ఈ విధానమే అమలువుతోంది. గత ప్రభుత్వ పాలనే భేష్ అంటూ కొనియాడుతున్నారు.

ఫేషియల్‌తో లింక్ అంటూ..



నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల జీతాలకు ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం)తో ఉన్నతాధికారులు లింకు పెట్టారు. ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు ఆధారంగానే అక్టోబరు జీతాలు జమ చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు జిల్లాలకు సమాచారం అందించారు. నేషనల్ హెల్త్ మిషన్‌తో పాటు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగులకు కూడా ఇదే ప్రాతిపదికన జీతాల బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. ఈ మేరకు గత నెల డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ప్రత్యేక మెమో జారీ చేసింది. జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్‌లో 828 మంది మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, వందల సంఖ్యలో డాక్టర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, సెకండ్ ఏఎన్‌ఎంలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పని చేస్తున్నారు. తాజా నిర్ణయంతో వారందరికీ అక్టోబరు జీతంలో భారీగానే కోత పడనుంది. ప్రభుత్వం మారిన తర్వాత మళ్లీ అదే నిర్ణయాన్ని అమలు చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఫీల్డ్ స్టాఫ్‌గా పరిగణించే మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ల జీతాలకు ఎఫ్‌ఆర్‌ఎస్ లింకు వర్తింపు చేయడం కక్షసాధింపు కిందకే వస్తుందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 9.10 గంటలలోపే అటెండెన్స్ వేస్తేనే జీతాలు కోతలు ఉండవని అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహం తొలగింపు



దాసార్లపల్లెలో యువజన సేవాసమితి సభ్యులను నియంత్రిస్తున్న పోలీసులు

బైరెడ్డిపల్లె : మండలంలోని దాసార్లపల్లెలోని ప్రభుత్వ భూమిలో ఈనెల 3న గ్రామానికి చెందిన అంబేడ్కర్ యువజన సేవాసమితి సభ్యులు అంబేడ్కర్ రాతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మాధవరాజు, ఎస్‌ఐ పరుశురాముడు సోమవారం పోలీసు సిబ్బందితో దాసార్లపల్లెకు చేరుకుని అంబేడ్కర్ రాత్రి విగ్రహాన్ని తొలగించారు. దీంతో అంబేడ్కర్ యువజన సేవా సమితి సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని అధికారులతో వాగ్వివాదానికి దిగారు. విగ్రహం తొలగించరాదని వాదనకు దిగారు. ప్రభుత్వ స్థలంలో ఎలాంటి ఉత్తర్వులు లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేయరాదని, చట్ట విరుద్ధమైన పనులు చేస్తే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్, ఎస్‌ఐ హెచ్చరించారు. ప్రభుత్వస్థలం ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పోక్సో కేసు నమోదు



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళెం: మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై సోమవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని వెలుతురుచేను గ్రామానికి చెందిన మునిరత్నం కుమారుడు నరేంద్ర అదే గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో బాధితురాలి కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచామన్నారు. ఏఎస్‌ఐ రామచంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

పుంగనూరు: కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురైన వివాహిత పురుగుల మందు తాగి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానిక సీఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు వివరాలిలా.. మండలంలోని పట్రపల్లికి చెందిన రాజా భార్య రాధ(30)కు భర్త కుటుంబసభ్యులతో కొంతకాలంగా విబేధాలు తలెత్తాయి. ఇలా ఉండగా బుధవారం ఉదయం కుటుంబసభ్యులతో రాధకు మరోమారు గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో ఆమె మనస్థాపానికి గురై ఇంట్లోనే పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని హుటాహుటిన స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితురాలు చికిత్స పొందుతోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తెంపు.. జంపు..

- జిల్లాలో పోలీసులకు సవాల్ విసురుతున్న చైన్ స్నాచర్లు
- నిన్న పుంగనూరు, నేడు పూతలపట్టు
- ఏడు రోజుల్లో 8 స్నాచింగ్స్
- స్నాచర్లు లాక్కెళ్లిన 304 గ్రాముల విలువ రూ.21 లక్షలు
- ఒంటరి మహిళలకే టార్గెట్
- పోలీసులు స్నాచర్ల తాట తీసేదెప్పుడో..?



పుంగనూరు/పూతలపట్టు: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం ఉన్న జిల్లాలో ఎన్నడూ లేని విధంగా చైన్ స్నాచర్లు విజృంభించడంతో మహిళలు హడలిపోతున్నారు. రోడ్డుపైకి రావాలంటే ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళనచెందుతున్నారు. ఏడు రోజుల్లో 8 మంది మహిళల మెడల్లోని బంగారు చైన్లు, తాళిబొట్లను చైన్ స్నాచర్లు లాక్కెళ్లిన ఉదంతాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. 8 దొంగతనాలలో మహిళలు 304 గ్రాముల బంగారు చైన్లు, తాళిబొట్లు కోల్పోయారు. వీటి విలువ సుమారుగా రూ.21 లక్షలు. జిల్లాలో చైన్ స్నాచింగ్ నిత్యం ఎక్కడో ఒకచోట పరిపాటిగా మారింది. మహిళల గోల్డ్ చైన్లు తెంపుకుని బైక్‌పై జంప్ అవుతున్న స్నాచర్ల భరతం పట్టడంతో పోలీస్ యంత్రాగం విఫలమవుతోందని విమర్శలొస్తున్నాయి. సీసీ పుటేజీ ఉన్నా వారిని పట్టుకోవడంలో ఉదాసీనత కనబరుస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

పంథా మార్చిన స్నాచర్లు

చైన్ స్నాచర్లు సైతం చోరీల విషయంలో అప్‌డేట్ అవుతున్నట్టు ఉదంతాలను విశ్లేషిస్తే తేటతెల్లమవుతోంది. గత ఏడాది స్నాచర్లు టోపీలు పెట్టుకుని మహిళలను గమనించి, మదనపల్లె, బోయకొండకు ఎలా వెళ్లాలనే భక్తుల లెవెల్లో బురిడీ కొట్టిస్తూ స్నాచింగ్ చేసి ఉడాయించారు. ఇప్పుడు తమ పంథా మార్చారు. ఎవరినీ ఏమీ అడిగే పనిలేకుండా హెల్మెట్లు ధరించి ఒంటరిగా కనిపించిన మహిళ మెడలో చైన్ లాక్కెళ్లి ఉడాస్తున్నారు. గత డిసెంబర్ 20న ద్విచక్రవాహనంపై హెల్మెట్లు ధరించి తొలుత అన్నమయ్య జిల్లా మదనపల్లెలో లక్ష్మీదేవమ్మ మెడలోని 42 గ్రాముల చైన్ లాక్కెళ్లారు. అక్కడి నుంచి నేరుగా బైక్‌పై పుంగనూరు మండలంలోని సుగాలిమిట్ట తాండాలో అంగన్‌వాడీ టీచర్ బి.సుశీలను మదనపల్లెకు దారి ఎటు? అని అడిగే నెపంతో ఆమె మెడలోని సుమారు 40 గ్రాముల బంగారు చైను లాక్కెళ్లారు. అలాగే అక్కడి నుంచి నేరుగా చౌడేపల్లె మండలం బత్తలాపురం క్రాస్‌కు చేరుకున్న స్నాచర్లు పొలం వద్ద ఉన్న రుక్మిణమ్మను బోయకొండకు ఎలా వెళ్లాలని అడుగుతూ క్షణాల వ్యవధిలో ఆమె మెడలో ఉన్న 17 గ్రాముల చైను లాక్కెళ్లి ఉడాయించారు. అక్కడి నుంచి పీలేరుకు వెళ్లిన స్నాచర్లు అనూహ్యంగా పోలీసులకు పట్టుబట్టారు. కాగా, ఆ కేసులో దొంగలే ప్రస్తుతం ఈ దొంగతనాల్లో పాల్గొన్నారా? అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చైన్‌స్నాచింగ్‌ల జోరు

- ఈనెల 1న రామసముద్రం మండలం పనమరెడ్డిపల్లెకు చెందిన నాగజ్యోతి సాయంత్రం 6 గంటల సమయంలో పట్టణంలోని పుంగమ్మ చెరువు కట్టపై నిలబడి ఉండగా ఇద్దరు యువకులు బైక్‌పై హెల్మెట్‌తో వచ్చి ఆమె మెడలోని 20 గ్రాముల నెక్లెస్‌ను లాక్కెళ్లారు.
- శనివారం రాత్రి పట్టణానికి చెందిన పురుషోత్తం రాజు భార్య కమల కుటుంబ సభ్యులతో గుడికి వెళ్లి తిరిగి గ్యాస్ ఆఫీసు వద్దకు రాగా ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని 30 గ్రాముల బంగారు చైను, రెండు తాళిబొట్లు లాక్కుని ఉడాయించారు.
- చౌడేపల్లె మండల కేంద్రంలో బైసాని ఫంక్షన్ హాల్ వద్ద రాజమ్మ అనే వృద్ధురాలు నిలుచుకుని ఉండగా ఆ సమయంలో ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని 42 గ్రాముల బంగారు చైను లాక్కుని అదృశ్యమయ్యారు.



- గత నెల 26న పూతలపట్టు హైవేలో చెయిన్ స్నాచర్లు రెచ్చిపోయారు. ఒకే రోజు మూడు చెయిన్ స్నాచింగ్‌లు చేసి పోలీస్‌లకు సవాల్ విసిరారు. కిచ్చన్నగారిపల్లెకు చెందిన మల్లిక పొలం వద్ద నుంచి ఆవులతో ఇంటికి వెళ్తుండగా ఆమె మెడలోని 56 గ్రాముల చైను, జి.గొల్లపల్లెకు చెందిన నాగరత్నమ్మ మెడలోని 36 గ్రాముల చైను లాక్కెళ్లారు.

స్నాచర్లను ప్రతిఘటించి.. తిరిగి రాని లోకాలకు..!



చైన్ స్నాచర్ల దాడిలో మృతి చెందిన వైఎస్‌గేటుకు చెందిన ప్రమీల (ఫైల్)

- అలాగే గత నెల 26న ఐరాల మండలం పుల్లూరుకు చెందిన ప్రమీల(60), తన కుమార్తె మల్లికతో ద్విచక్రవాహనంపై తన స్వగ్రామానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా మండలంలోని తిమ్మిరెడ్డిపల్లె చెరువు వద్ద బైక్‌లో వచ్చిన చైన్ స్నాచర్ల దాడికి గురైంది. ఒక యువకుడు ప్రమీల మెడలోని బంగారు గొలుసును బలంగా లాగాడు. దీంతో ఆమె బంగారు చైన్‌ను పట్టుకోవడంతో స్నాచర్ ధాటికి ఉన్నపళాన ఆమె రోడ్డుపై పడిపోయింది. తీవ్రగాయాల పాలైన ఆమెను కాపాడేందుకు కుటుంబ సభ్యులు చిత్తూరు, వేలూరు సీఎంసీలతో చికిత్స చేయించిననూ ప్రాణాలు దక్కలేదు. పరిస్థితి విషమించి గత శుక్రవారం ఆమె మరణించడం విదితమే.
- తాజాగా ఆదివారం పూతలపట్టు మండలం తిమ్మిరెడ్డిపల్లె జగనన్న కాలనీకి చెందిన భారతిని కత్తితో బెదిరించి మెడలోని 25 గ్రాముల బంగారు చైన్‌ను తెంపుకుని స్నాచర్లు బైక్‌లో ఉడాయించారు. స్నాచర్లు అంతా యువకులే కావడం గమనించదగ్గ అంశం.

పక్కా స్కెచ్‌తో స్నాచింగ్

చిత్తూరు, పూతలపట్టు, పుంగనూరు, చౌడేపల్లె ప్రాంతాలలో చైన్ స్నాచింగ్‌లు హైవేలలోనే జరగడం చూస్తే పక్కా స్కెచ్ వేసి స్నాచర్లు చోరీలకు పాల్పడుతున్నట్టు స్పష్టమవుతోంది. పుంగనూరులో మూడు స్నాచింగ్ ఘటనల్లో ఎఫ్‌జెడ్ బైక్ ఒకటి, కేటీఎం బైక్‌లు వినియోగించినట్లు సీసీ పుటేజీలలో తేలింది. నేరాల్లో యువకులే పాల్గొనడం గమనార్హం. కాగా పుంగనూరు, చౌడేపల్లెలో జరిగిన మూడు స్నాచింగ్ ఘటనల్లో వేర్వేరు ముఠా సభ్యులు చేసి ఉంటారని, అలాగే చిత్తూరు, పూతలపట్టులో జరిగిన నేరాలలో కూడా వేరే ముఠా సభ్యులు ఉండొచ్చని అనుమానిస్తున్నారు. పోలీసులకు ఆధారాలు లభించకుండా ఉండేందుకు మోటార్ సైకిళ్లకు నంబర్ ప్లేట్లు లేకుండా, ముఖాలు కనిపించకుండా హెల్మెట్లు ధరించి స్నాచింగ్ చేస్తుండటం సవాల్‌గా మారినప్పటికీ సాంకేతిక పరిజ్ఞానం, ఇతరత్రా నేర ఘటన ఆధారంగా కీలక ఆధారాలు సేకరించడంలో పురోగతి సాధిస్తామని పోలీస్ శాఖ చెబుతోంది. మరోవైపు పోలీసులు చైన్ స్నాచర్ల తాట తీసే రోజెప్పుడో!? అని మహిళలు తమ మెడలను తడుముకోవాల్సిన పరిస్థితి వస్తోంది.



చౌడేపల్లెలో సీసీ పుటేజీలను పరిశీలిస్తున్న సీఐ రాంభూపాల్, సిబ్బంది

దర్యాప్తు చేస్తున్నాం



గత నెలలో జరిగిన చైన్ స్నాచింగ్ ఘటనలకు సంబంధించి ప్రాథమికంగా సేకరించిన ఆధారాలతో కేసు దర్యాప్తు చేస్తున్నాం. త్వరలో నిందితులను పట్టుకుంటాం. మండలంలోని జరిగిన బంగారు చైన్ కేసులోని బాధితులకు న్యాయం చేస్తాం. అలాగే ఇవి పునరావృతం కాకుండా మండల నలుమూలలా సీసీ కెమెరాలు అమర్చేలా పనులు చేస్తున్నాం.

– కృష్ణమోహన్, సీఐ, పూతలపట్టు

పండుగ వేళ..

తీరని విషాదం

- దీపావళి నాడు స్టీల్ గిన్నెకు రంధ్రం పెట్టి టపాసులు పేల్చిన బాలుడు
- గిన్నె ముక్క బాలుడి గొంతును కోసిన వైనం
- ఉన్న ఒక్క కొడుకు చనిపోవడంతో శోకసంద్రంలో గిరిజన కుటుంబం
- పుత్తూరు మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



ఎస్.చరణ్ (ఫైల్)

పుత్తూరు: దీపావళి అందరి ఇళ్లలో ఆనందాన్ని నింపితే.. ఆ నిరుపేద గిరిజన కుటుంబంలో పెను విషాదాన్ని మిగిల్చింది. కొడుకు ప్రయోజకుడై కుటుంబానికి అండగా నిలుస్తాడని భావించిన ఆ తల్లిదండ్రుల ఆశలపై విధి చిన్నచూపు చూసింది. స్టీల్‌గిన్నెకు రంధ్రం పెట్టి టపాసులు పేల్చుతుండగా, ఆ గిన్నె మూడు ముక్కలై, ఒక ముక్క బాలుడి గొంతుకు బలంగా గుచ్చుకోవడంతో చనిపోయిన ఘటన గత నెల 31వ తేదీన పుత్తూరు మండలంలో చోటు చేసుకోగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. వడమాలపేట మండలం టీసీ అగ్రహారం గ్రామానికి చెందిన శ్రీనివాసులు, ఈశ్వరి దంపతులు కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి కుమార్తె వందన(17), కొడుకు చరణ్(15) ఉన్నారు. అయితే శ్రీనివాసులు కుటుంబం ఆర్నెళ్ల కిందటే ఈశ్వరి పుట్టినిల్లు అయిన పుత్తూరు మండలంలోని గట్టు ఎస్టీ కాలనీకి షిఫ్ట్ అయింది. వారి కొడుకు చరణ్ పక్కనే ఉన్న గోపాలకృష్ణాపురం గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో గత నెల 31వ తేదీ గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో వీధిలో తోటి పిల్లలతో కలిసి చరణ్ టపాసులు కాల్చుతున్నాడు. ఇంటిలోని ఓ స్టీల్ గిన్నెను తెచ్చి, దానికి రంధ్రం చేసి అందులో టపాసును పెట్టి రెండుసార్లు కాల్చాడు. మూడవసారి టపాసు పేలుడు ధాటికి గిన్నె మూడు ముక్కలై, అందులో ఒకటి సరాసరి చరణ్ గొంతుకు బలంగా తాకింది. తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే బాలున్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ వైద్యులు శస్త్రచికిత్స చేసినా ఫలితం లేకపోయింది. అదేరోజు రాత్రి 12.57 గంటలకు చరణ్ మృతి చెందాడు. అయితే ఈ సంఘటన ఎవరికీ తెలియలేదు. సోమవారం గట్టు ఎస్టీ కాలనీవాసులు చెప్పడంతో మీడియాకు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బిడ్డను పోగొట్టుకున్న శ్రీనివాసులు కుటుంబం

జీతాలు.. సారూ..!



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేస్తున్న 108 సిబ్బంది

వి.కోట: అందరి ప్రాణాలను కాపాడే తమకే జీతాలు ఇవ్వకపోవడంతో పండగపూట పస్తులు ఉండేలా చేశారని మండల 108 సిబ్బంది మండిపడ్డారు. సోమవారం మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ప్రాంగణంలో సిబ్బంది పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని, అరబిందో యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి వీడాలంటూ నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే తాము కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. నిరంతరం కష్టపడుతున్న తమకే జీతాలు ఇవ్వకపోవడం సమంజసమేనా ? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే 108 ఉద్యోగ సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి శంకర్‌నారాయణ, సభ్యులు ధనపాల్, శివభూషణం, పావని, గౌస్, రెడ్డి జిలానీ తదితరులు పాల్గొన్నారు.

మద్యం, సారా పట్టివేత

చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యం, యాదమరి మండలాల్లో సోమవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు అక్రమ మద్యం విక్రయాలపై దాడులు చేశారు. బంగారుపాళ్యం మండలం కచ్చేటివారిపల్లికి చెందిన నారాయణస్వామి వద్ద నుంచి 20 మద్యం బాటిళ్లు, అలాగే యాదమరి మండలం బోడేగుత్తపల్లికి చెందిన ప్రేమ అనే మహిళ నుంచి 17 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దాడుల్లో సీఐ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 22 ఫిర్యాదులు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: పోలీసు శాఖ నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో 22 ఫిర్యాదులు అందాయి. సోమవారం చిత్తూరులోని పోలీసు ఆర్ముడు రిజర్వు కార్యాలయంలో ఎస్పీ మణికంఠ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. సమస్యలపై ప్రజల నుంచి వచ్చే వినతులను పరిష్కరించడంలో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని ఆదేశించారు. పోలీసుల సమస్యలు, కుటుంబ తగాదాలు, వేధింపులు, డబ్బు తగాదాలు, భూ తగాదాలు, ఆస్తి తగాదాలకు సంబంధించిన ఫిర్యాదులు అందినట్టు చెప్పారు. వీటిని ఆన్‌లైన్‌లో సైతం నిక్షిప్తం చేయాలన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్పీ మణికంఠ

ఆర్థికసాయం అందజేత

చిత్తూరు అర్బన్: స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన పోలీసు కుటుంబానికి చిత్తూరు ఎస్పీ మణికంఠ డెత్ రిలీఫ్ ఫండ్ నుంచి రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. ఐరాల స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకటరమణ గత నెల 23వ తేదీన అనారోగ్యంతో మరణించాడు. ఈ మేరకు ఎస్పీ చిత్తూరులోని ఏఆర్ పోలీసు కార్యాలయంలో సోమవారం మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు.

క ఆదరించి హిట్ ఇచ్చారు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు వాసులు 'క' సినిమాను ఆదరించి ప్రేక్షకులు మంచి హిట్ ఇచ్చారని సినీనటుడు కిరణ్ అబ్బవరం కృతజ్ఞతలు తెలిపారు. చిత్తూరులోని గురునాథ థియేటర్‌లో సోమవారం క చిత్ర యూనిట్ సందడి చేసింది. హీరో కిరణ్ అబ్బవరానికి అభిమానులు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం థియేటర్‌లో ప్రేక్షకులు, అభిమానులతో మాట్లాడారు. ఈ చిత్రం మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుందన్నారు. ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. థియేటర్ అధినేత బాలగురునాథం, వికాశ్, డిస్ట్రిబ్యూటర్ రమేష్, వీ.మెగా ఇన్‌చార్జ్ విజి, మురళి తదితరులు పాల్గొన్నారు.



ప్రేక్షకులు, అభిమానులను ఉద్దేశించి మాట్లాడుతున్న కిరణ్ అబ్బవరం

మా మొర ఆలకించండి..

- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతుల వెల్లువ
- 171 అర్జీల నమోదు
- సమస్యలు పరిష్కరించాలని వేడుకున్న బాధితులు
- అర్జీలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ఇతర అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : మా మొర ఆలకించడయ్యా అంటూ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు అధికారులకు వినతులు అందజేసి వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్‌ఓ మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయా అర్జీలను జిల్లా అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అధికారులను జేసీ ఆదేశించారు.

ఆశ్రమం వద్ద సమస్యలు పరిష్కరించాలి..

చిత్తూరు నగరంలోని సంతపేట వద్ద ఉన్న శ్రీ రామచంద్ర ఆశ్రమం వద్ద సమస్యలు పరిష్కరించాలని సమీపంలోని కాలనీ వాసులు నందకుమార్, మోహన్ కలెక్టరేట్ అధికారులకు విన్నవించారు. ఆశ్రమం చుట్టుపక్కల చాలా నివాసాలు ఉంటున్నాయని, సర్వే నంబర్ 423లో ఉన్న చెరువు వద్ద ఉన్న తూమును సరిచేయాలని కోరారు. వర్షాలు వస్తే రాకపోకలకు చాలా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు నగరపాలక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగడం లేదన్నారు. కిషోర్, గజేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొత్తం అందిన అర్జీలు	171
ఎక్కువగా వచ్చినవి రెవెన్యూ శాఖ	131
డీఆర్‌డీఏ	07
పోలీస్ శాఖ	03
వెటర్నరీ శాఖ	08
మిగిలిన శాఖలు	22





రుణాలు ఇప్పించాలని కోరుతున్న కేశవకుప్పం ఎస్టీ కాలనీ వాసులు, సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న సంతపేట వాసులు

రుణాలు మంజూరు చేయండి..

గిరిజన కార్పొరేషన్ ఆధ్వర్యంలో రుణాలు మంజూరు చేయాలని కార్వేటినగరం మండలం కేశవకుప్పం ఎస్టీ కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు ఆ కాలనీ వాసులు జ్యోతి, చిన్నక్క మాట్లాడుతూ తమ కాలనీలో 15 కుటుంబాలు జీవిస్తున్నట్లు తెలిపారు. తమకు ఎలాంటి జీవనాధారం లేదని, తమకు ఇప్పటికీ ప్రభుత్వం అమలు చేసే పథకాలు అందడం లేదని వాపోయారు. అధికారులు స్పందించి గిరిజన కార్పొరేషన్ ఆధ్వర్యంలో రుణాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు వల్లెమ్మ, శోభ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

పాసుపుస్తకాలు మంజూరు చేయండి..

తమ అనుభవంలో ఉన్న వ్యవసాయ భూములకు పట్టాలు, పాసుపుస్తకాలు మంజూరు చేయాలని గుడిపాల మండలం నారగల్లు ఎస్టీ కాలనీకి చెందిన గిరిజనులు జేసీకి వినతిపత్రం అందజేశారు. గిరిజనులు మణి, కల్పన మాట్లాడుతూ తమ కాలనీలో సుమారు 16 కుటుంబాలు గత 30 ఏళ్లుగా జీవిస్తున్నట్లు తెలిపారు. సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో చాలా ఏళ్లుగా చదువును చేసుకుని వ్యవసాయం చేసుకుంటున్నట్లు చెప్పారు. అయితే కొంతమంది అగ్రకులస్తులు తమ భూములను లాక్కొనేందుకు దౌర్జన్యం చేస్తున్నట్లు వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు పట్టాలు, పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరారు.



పట్టాలు, పాసుపుస్తకాలు ఇప్పించాలని కోరుతున్న నారగల్లు ఎస్టీ కాలనీ వాసులు

సంరక్షణ కేంద్రాలకు అనుమతులు తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో బాలల సంరక్షణ కేంద్రాలను నిర్వహించాలంటే అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని వీధి బాలల సంక్షేమ శాఖ జిల్లా పర్యవేక్షణ అధికారి లక్ష్మీపతి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికే ఎవరైనా బాలల సంరక్షణ కేంద్రాలను నిర్వహిస్తుంటే కచ్చితంగా అనుమతులు పొందాలన్నారు. కొత్తగా ఏర్పాటు చేయాలనుకున్న వారు అనుమతులు పొందవచ్చని తెలిపారు. అనుమతులు లేకుండా ఎవరైనా సంరక్షణ కేంద్రాలు నడిపితే ఏడాది జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుందని హెచ్చరించారు. బాలల సంరక్షణ కేంద్రాలు ఇతర ఏదైనా చట్టంలో లైసెన్సు తీసుకున్నప్పటికీ జువైనల్ జస్టిస్ పిల్లల సంరక్షణ, రక్షణ చట్టం–2015 లోని సెక్షన్ 41 ప్రకారం అనుమతులు పొందాలన్నారు. ఈ నెల 11వ తేదీ లోపు విజయవాడలోని బాలల సంక్షేమ సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు దరఖాస్తులు పంపాలన్నారు. వివరాలకు 9701386650, 94913 55890 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

8మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

పుంగనూరు: పేకాట ఆడుతున్న 8 మందిని పట్టుకుని, 5 బైక్‌లు, రూ.18,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు సోమవారం రాత్రి మండలంలోని నేతిగుట్లపల్లి వద్ద పేకాట ఆడుతుండగా దాడి చేసి 8 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.